క్లుప్తంగా

డయల్ యువర్ డీఎం- 1 నేడు

నెల్లూరు సిటీ : డయల్ యువర్ డీఎం-1 కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు డీఎం మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలను 99592 25641 నంబర్‌కు సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య తెలియజేయవచ్చన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలో 105 అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న 60 రోజుల్లో పనులను పూర్తి చేస్తామన్నారు. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా సంబరాలు



కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యార్థులు

నెల్లూరు (టౌన్) : స్థానిక కాకుటూరులోని కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో క్రీడా సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంబీఏ, ఎంసీఏ, పీజీ విద్యార్థులకు కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, షటిల్, వన్ మినిట్ గేమ్ తదితర పోటీలు జరిపారు. విజేతలకు కళాశాల వార్షికోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నారు. అనంతరం కళాశాల వ్యవస్థాపక చైర్మన్ కృష్టారెడ్డి, డైరెక్టర్ ప్రమోద్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ అవసరమన్నారు. కార్యక్రమంలో డీన్ జ్యోతి, ప్రిన్సిపల్ ఎం.ప్రసాద్, హెచ్ఓడీ ఫణికుమార్ పాల్గొన్నారు.

కార్యకర్తకు అండగా నిలిచిన ఎమ్మెల్సీ



ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలుపుతున్న బాధితుడు ప్రసాద్

నెల్లూరు(బారకాసు) : ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో లాండ్రి బండిని కోల్పోయిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ధోబి ప్రసాద్‌కు పార్టీ నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అండగా నిలిచారు. ఈ మేరకు నూతన లాండ్రి బండిని ప్రసాద్ ఇంటి వద్దనే అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు ప్రసాద్ నగరంలోని రాంజీనగర్‌లో ఉన్న నగర పార్టీ కార్యాలయంలో ఆదివారం చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జునతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా అధికారులకు చోటు



ఎన్నికైన నూతన కార్యవర్గం

నెల్లూరు(క్రైమ్) : విజయవాడలోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘ రాష్ట్ర నూతన కార్యవర్గంలో జిల్లాకు చెందిన ఇద్దరు ఎక్సైజ్ అధికారులకు చోటు దక్కింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎక్సైజ్ నెల్లూరు-1 ఎస్సై ఎస్.ప్రభాకర్‌రావు, జోన్-3 కార్యదర్శిగా ఇందుకూరుపేట ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు వారిని నెల్లూరు డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు, డీపీఈఓ ఎ.శ్రీనివాసులునాయుడు అభినందించారు.

ధన్‌బాద్ రైలుకు స్టాపింగ్

నెల్లూరు(సెంట్రల్): ధన్‌బాద్-కోయంబత్తూరు ప్రత్యేక రైలుకు ఈ నెల 10, 11 తేదీల్లో నెల్లూరులో తాత్కాలిక స్టాపింగ్ ఇచ్చినట్లు రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ట్రెయిన్ నంబర్ 03679 ధన్‌బాద్-కోయంబత్తూరు 10న నెల్లూరుకు, 03680 కోయంబత్తూరు- ధన్‌బాద్ 11న నెల్లూరుకు చేరుకుంటాయన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నెల్లూరు స్టాపింగ్ కొనసాగించాలా లేదా అనేది త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు.

కూటమి ప్రభుత్వంలో నగరపాలన అస్తవ్యస్తంగా మారింది. నగర ప్రజలపై దోమలు, కుక్కలు, పశువులు ముప్పేట దాడి చేస్తున్నాయి. వీటి బారి నుంచి తప్పించుకునేందుకు ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు, లోతట్టు ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతూ ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. శునకాలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో కనిపించిన మనిషిని వెంటబడి కరుస్తున్నాయి. పశువులు రోడ్లపై కనిపిస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరికలు చేసినప్పటికీ అవి రోడ్లపైనే తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

నగరపాలన.. అస్తవ్యస్తం



చిల్డ్రన్స్‌పార్కు సమీపంలోని ఓ వీధిలో సంచరిస్తున్న కుక్కలు

- వీధుల్లో కుక్కలు, పందుల స్వైర విహారం
- అధ్వాన పారిశుద్ధ్యంతో దోమల బెడద
- రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులు

నెల్లూరు(బారకాసు) : చీకటి పడిందంటే నగరంలో దోమల దండయాత్ర మొదలవుతుంది. పలు ప్రాంతాల్లో ప్రజలు తలుపులు, కిటికీలు మూసేసి ఇంట్లోనే ఉండాల్సి వస్తోంది. దోమల నియంత్రణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో దోమల వల్ల వ్యాధులు విజృంభిస్తున్న పరిస్థితులున్నప్పటికీ వైద్యారోగ్యశాఖ, నగరపాలక సంస్థ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రి వేళల్లో ఫాగింగ్ సంగతి మర్చిపోయారని ప్రజలు మండిపడుతున్నారు. మురుగు కాలువలు పారుదల లేక నీరు నిల్వ చేరడం వల్ల దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. దోమల దాడి నుంచి తప్పించుకునేందుకు మెష్‌లను డోర్లు, తలుపులు, కిటికీలు వేసుకున్నా ఏదో ఒక మార్గంలో ఇళ్లల్లోకి వచ్చేస్తున్నాయి. మస్కిటో కాయిల్స్, మస్కిటో బత్తీలు, ఆలవుట్, గుడ్‌నైట్ లిక్విడ్లు చివరకు శరీరానికి ఆయిల్ పూసుకున్నప్పటికీ దోమలు తమ పని కానిచ్చేస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పడుకునే వరకు దోమల బ్యాట్లకు పనిచెబుతూనే ఉన్నారు.

రెక్కేస్తున్న కుక్కలు

నగర ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో కుక్కలు అగ్రభాగంలో ఉన్నాయి. వీధి కుక్కలను నియంత్రిస్తామని నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో కార్యరూపం దాల్చడం లేదు. దీంతో కుక్కల సంఖ్య ఒక్కసారిగా పెరిగిపోయింది. ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులుగా తిరుగుతూనే ఉంటున్నాయి. కుక్కలను తోలదామని ప్రయత్నిస్తే వాటి అరుపులకు ప్రజలు దడుచుకుంటున్నారు. ఒకవేళ కుక్కను అదిలిద్దామని ప్రయత్నిస్తే ఎదురు తిరిగి కరిచేందుకు మీదకొస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్డు మలుపుల వద్ద కుక్కలు గుంపులుగా ఉండటంతో అటు వైపు వెళ్లేందుకు సైతం జంకుతున్నారు. కుక్కలను నియంత్రించడంలో సంబంధిత అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



నజీర్‌తోట కాలువలో పారుదల లేక నిల్వ చేరిన మురుగునీరు



మైపాడురోడ్డుపై సంచరిస్తున్న ఆవులు

రోడ్లపైనే పశువులు



నగరంలోని ట్రంకురోడ్డు, వీఆర్సీ సెంటర్, మద్రాసు బస్టాండ్, ఆర్టీసీ ప్రాంతాల్లో ట్రాఫిక్ విపరీతంగా ఉంటోంది. ఎవరు ఎటువైపు వస్తుంటారో తెలియని పరిస్థితి. ఇదిలా ఉంటే మరోవైపు రోడ్లపైనే పశువులు సంచరించడంతో బైక్‌లపై ప్రయాణించాలంటే భయమేస్తోంది. మైపాడు రోడ్డులో ఆవుల మంద నిత్యం సంచరిస్తున్నాయి. పశువులను నగర రోడ్లపై తిరగనీయకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మల్లికార్జునరెడ్డి, నెల్లూర నగరం

వీధుల్లో తిరగలేకపోతున్నాం



వీధుల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. అవి ఎక్కడ కరుస్తాయోనని భయపడాల్సి వస్తోంది. చిన్నపిల్లల విషయంలో మరింత ఆందోళన పడాల్సి వస్తోంది. ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. రాత్రివేళల్లో ఇళ్లకు వెళ్లాలంటేనే వణికిపోతున్నాం. కుక్కలను నియంత్రించే దిశగా నగరపాలక సంస్థ చర్యలు చేపడితే మంచిది.

– షాజహాన్, న్యూకాలనీ, జాకీర్‌హుస్సేన్‌నగర్

పరుగులు పెట్టిస్తున్న పశువులు

నగరంలోని పశువులు రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతూనే ఉన్నాయి. రోడ్లపై పశువులు తిరగకూడదని నగరపాలక సంస్థ పశు యజమానులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ వారు బేఖాతరు చేస్తున్నారు. నగరంలోని ప్రధాన కూడలి అయిన మద్రాసు బస్టాండ్, ఆర్టీసీ, వీఆర్సీ, స్టోన్‌హౌస్‌పేట, పెద్దబజారు, చిన్నబజారు తదితర ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో పశువులు గుంపులుగా తిరుగుతూ ఉండడం పరిపాటి అయింది. ఆయా ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతూనే ఉంటుంది. ఇక మద్రాసు బస్టాండ్ సెంటర్(పెద్ద కూరగాయల మార్కెట్) సెంటర్ వద్ద అయితే పశువులు మనుషులను సైతం పరుగులు పెట్టిస్తూ ఉంటాయి. అక్కడ కూరగాయలు, పండ్లు తీసుకునేందుకు వచ్చిన వారిని నెట్టుకుంటూ పశువులు వెళ్లడం పరిపాటిగా మారింది. కొన్ని సమయాల్లో పశువులు పరుగులు తీస్తూ ఉండటంతో వాటిని తప్పించుకోవాలంటే ప్రాణాలు పోయినంతపనవుతోంది. పశువుల వల్ల ప్రాణాలు పోయాయన్న మాట వినిపించక ముందే నగరపాలక సంస్థ స్పందించి బహిరంగ ప్రదేశాల్లో పశువులు సంచరించకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నజీర్‌తోటలో చెత్తకుప్పల్లో పందులు

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- పద్మశాలి సంఘీయులకు దక్కిన మహద్భాగ్యం
- అనాదిగా ధ్వజపతాక ఆవిష్కరణలో భాగస్వామ్యం

నెల్లూరు(బృందావనం) : నగరంలోని రంగనాయకులపేటలో ఉన్న తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ జరిగింది. హిందూ దేవాలయాల్లో జరిగే ఉత్సవాల్లో ప్రధానమైనది బ్రహ్మోత్సవం. ఇది తొమ్మిది రోజులపాటు జరిగే పండగ. ఇందులో ప్రధాన ఘట్టమైన ధ్వజారోహణ కార్యక్రమానికి ఎంతో విశిష్టత ఉంది. దీనికి భాగస్వామ్యులుగా పద్మసాలి సంఘీయులకు మహదవకాశం కలిగింది.

ప్రధానమైన వస్త్రం సమర్పించే భాగ్యం

ధ్వజారోహణలో భాగంగా సకల దేవతలను ఆహ్వానిస్తూ వైష్ణవ సంప్రదాయంలో గరుత్మంతుడిని, శైవ సంప్రదాయంలో నందీశ్వరుడిని, అలాగే అమ్మవార్లకు జరిగే బ్రహ్మోత్సవాల్లో వ్యాఘ్ర, సింహ రూపాలను నూతన శ్వేతవస్త్రంపై చిత్రలేపనం చేస్తారు. తరువాత శాస్త్రోక్త పూజలతో ఉత్సవమూర్తులను ప్రదక్షణంగా కొలువుదీర్చి పొంగలి నివేదనతో ధ్వజంపై పతాకాన్ని ఆవిష్కరింపజేసే కార్యక్రమం ధ్వజారోహణం. ఇందుకు ప్రధానమైన వస్త్రం సమర్పించే భాగ్యం సంప్రదాయంగా పద్మసాలి సంఘీయులకు దక్కుతోంది.



విశేష వాహనంపై విహరిస్తున్న రంగడు

అంగరంగ వైభవంగా..

నెల్లూరు(బృందావనం) : రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు పుణ్యాహవచనం, విష్వక్సేనారాధన, స్వామివారి ఉత్సవమూర్తులకు రక్షాబంధనం, సోమకుంభ ప్రతిష్ట, గరుడ ధ్వజ ప్రతిష్ట, అంకురార్పణ హోమం తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆనం గోపాలకృష్ణారెడ్డి వ్యవహరించారు. కార్యక్రమాలను ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు పర్యవేక్షించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

'రంగడి' బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 4.40 గంటలకు ధ్వజారోహణం, రాత్రి 9 గంటలకు శేషవాహన ఉత్సవం జరుగనున్నాయని ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు.

పరమశివుడు కల్పించిన మహాభాగ్యం



దేవదేవుడు మార్కండేయుని రూపంలో భావనారుషి అవతారంలో సేవ చేసుకునే అదృష్టం చేనేత జాతికి కల్పించడం మహాభాగ్యం. పరమశివుడికి చేనేత జాతి రుణపడి ఉంటుంది. అనాదిగా భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణ కార్యక్రమంలో పాలుపంచుకోవడం పూర్వ జన్మసుకృతం.

– బూదాటి రాధయ్య, జాతీయ అధ్యక్షుడు, అఖిలభారత పద్మశాలి సంఘం

అదృష్టంగా భావిస్తున్నాం



గత 20 ఏళ్లుగా కొడి ఉభయం కార్యక్రమానికి సేవ చేసుకునే అదృష్టం భగవంతుడు మా కుటుంబానికి కల్పించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తాం. జిల్లాలో పద్మశాలి సంఘీయులను ఆహ్వానించి అంగరంగవైభవంగా నిర్వహిస్తాం.

– నందం అశ్వత్థామ, ప్రధాన కార్యదర్శి, పద్మశాలి సంఘం

దైవం ఇచ్చిన గొప్ప వరం



అటు వైష్ణవ, ఇటు శైవ సంప్రదాయమేదైనా ధ్వజారోహణ ప్రక్రియలో వస్త్రం సమర్పించే అవకాశం పద్మశాలి సంఘీయులకు దక్కడం దైవం మాకు ఇచ్చిన వరం. దేశంలో ఏ ఆలయమైన తమ ధ్వజారోహణంతో ఆరంభం కావడం సంతోషం.

– బుధవరపు బాలాజీ, జిల్లా అధ్యక్షుడు, అఖిలభారత పద్మశాలి సంఘం

పాలకులు నిర్లక్ష్యం వీడాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకులు నిర్లక్ష్య వైఖరి వీడాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు డిమాండ్‌చేశారు. నగరంలోని 11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో ప్రజా చైతన్య యాత్రను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ 11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్, రాయపుపాళెం, పల్లెపాళెం పరిసర ప్రాంతాల్లో ఇళ్లకు, ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ పట్టాలు ఇవ్వాలన్నారు. ఎన్టీఆర్ నగర్ హైవే నుంచి వచ్చే కూడలి వద్ద అండర్ పాస్ నిర్మించాలని, డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి కల్వర్టులను నిర్మించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నేతలు సూర్యనారాయణ, పెంచలయ్య, మురళి, ఆదిలక్ష్మి, శ్రీనివాసులు, అశోక్, నారాయణ, మల్లికార్జున, బాబు, శ్రీనివాసులు, కొండయ్య పాల్గొన్నారు.

54వ డివిజన్‌లో..

నగరంలోని 54వ డివిజన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఆధ్వర్యంలో జనార్దన్ రెడ్డి కాలనీ, లక్ష్మీపార్వతీనగర్ ప్రాంతాల్లో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానికులు కలుషిత నీటిని తాగాల్సి వస్తోందని, వెంకటేశ్వరపురంలోని బ్యాంకును స్టోన్ హౌస్‌పేటకు తరలించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సైడు కాలువల్లో పూడిక తీయడం లేదని, పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందన్నారు. పార్టీ నేతలు నాగేశ్వరరావు, మూలం ప్రసాద్, జాఫర్, గద్దం శ్రీనివాసులురెడ్డి, ఉడతా ప్రసాద్, బాబు, సమీవుల్లా, సురేష్, కృష్ణ, అల్లాభక్షు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ నగర్‌లో ప్రజా చైతన్య యాత్ర చేపడుతున్న సీపీఎం నేతలు

మహిళా సాధికారతతో దేశ ప్రగతి



నరసం ఆధ్వర్యంలో ఎస్వీ యూనివర్సిటీ హెచ్ఓడీ సమంతకను సన్మానిస్తున్న మహిళలు

నెల్లూరు (టౌన్) : మహిళా సాధికారత ద్వారానే దేశ ప్రగతి సాధ్యమని యూటీఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి నాగమణి తెలిపారు. స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీ విద్యావంతురాలైతే కుటుంబం మొత్తం అభివృద్ధిలో పయనిస్తుందన్నారు. సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న ఆకృత్యాలను అడ్డుకునేందుకు ప్రతిఒక్కరూ చైతన్యవంతులు కావాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అందిపుచ్చుకుని బాధ్యతాయుతంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యురాలు శ్రీదేవి, జిల్లా సహాయ అధ్యక్షురాలు సుభాషిణి, నాయకులు రమాదేవి, మస్తాన్‌బీ, జగదీశ్వరి, సుజాతమ్మ, విజయలక్ష్మి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శేషు, చలపతిశర్మ తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక మాగుంట లేఅవుట్‌లోని ఎస్సార్కే స్కూల్‌లో నవ్యాంధ్ర రచయిత్రుల(నరసం) ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ యూనివర్సిటీ హెచ్ఓడీ అక్కరాజు సమంతకను సత్కరించారు. కార్యక్రమంలో నరసం అధ్యక్షురాలు సుభద్రాదేవి, సభ్యులు ప్రసన్నలక్ష్మి, భారతి, సులోచన, ప్రసూన, శరత్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగమణి

విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనాలి



మాట్లాడుతున్న పలిశెట్టి దామోదర్‌రావు

నెల్లూరు సిటీ : విద్యుత్ బస్సులను ప్రైవేటు యాజమాన్యం ద్వారా కాకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీకి ఇచ్చి సొంతంగా నిర్వహించుకునే అవకాశం కల్పించాలని ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. నగరంలోని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం జరిగింది. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా దామోదరరావు మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఆర్టీసీలో విద్యుత్ ప్రైవేటు బస్సులను ప్రవేశపెట్టి అలిపిరి డిపోను ఖాళీ చేయించారని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృత్తం అవుతుందన్న ఆందోళనలో ఉద్యోగులు ఉన్నారన్నారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి జి.నారాయణరావు, నెల్లూరు జోన్ ఈయూ అధ్యక్షుడు వాకా రమేష్, జోనల్ కార్యదర్శి దాసరి బాబూ శామ్యూల్, మహిళా నేత సుభాషిని, జిల్లా కార్యదర్శి ఓవీ ప్రసాద్, ఎస్వీ సుబ్బారావు, రీజనల్ నాయకులు బి.మాల్యాద్రి, రవికుమార్, వీఎస్ రావు, యు.రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న డాక్టర్ భక్తవత్సలరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : తగిన వ్యాయామం, మంచి ఆహారపు అలవాట్ల ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకుందామని కార్డియాలజిస్ట్ డాక్టర్ భక్తవత్సలరెడ్డి తెలిపారు. వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏసీ స్టేడియంలో వాకర్స్‌కు గుండె ఆరోగ్యంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం, ఒబేసిటి వల్ల గుండెపోటులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా రోజుకి కనీసం అరగంట పాటు వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్ర రెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి గోపీనాథ్, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రషెట్టి, నాయకులు స్వర్ణ రమేష్‌బాబు, డాక్టర్ అంకిరెడ్డి, రాజారమేష్, చంద్రమౌళి, సుబ్బరామిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, విజయమోహన్‌నాయుడు, డాక్టర్ సత్యనాథ్, డాక్టర్ శ్రీనివాసకుమార్, డాక్టర్ ఎంఎస్‌రెడ్డి, శేషగిరిరావు, సుమారు 300 మంది వాకర్స్ పాల్గొన్నారు.

సహాయ నిధి చెక్కుల పంపిణీ



నెల్లూరు(సెంట్రల్) : ఆత్మకూరు నియోజకవర్గంలోని 27 మంది బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులను దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆచార్య ఆదిత్యకు నివాళి



నెల్లూరు (టౌన్) : స్థానిక చిల్డ్రన్‌పార్కు రోడ్డులోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఆచార్య ఆదిత్య నాలుగో వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాలతో పాటు, గీతామయి వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ సంఘం నాయకుడు చిరసాని కోటిరెడ్డి, సంఘ సంస్కర్త విజయరామ చౌదరి, రచయిత పొట్లూరు సుబ్రహ్మణ్యం, ఆదిత్య విద్యాసంస్థల సెక్రటరీ కృష్టారెడ్డి, కరెస్పాండెంట్ వెంకటరెడ్డి, సీఈఓ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్స్ పుల్లయ్య, అంకయ్య, శ్రీనివాసులురెడ్డి, కార్తీక్, వైస్ ప్రిన్సిపల్ శివతేజ తదితరులు పాల్గొన్నారు.